
# మాధురి

ఎ. రంగ



మాధురి పెళ్ళి, చాలా గొప్పగా, చాలా, వైభవంగా. జరిగిపోయింది. ఇద్దరి తండ్రుల ఏకైక తనయ ? మరి !! వైభవంగా, కాక మామూలుగా, ఎలా జరుగుతుంది ?! తండ్రి లేండులార్డు! చిన్నాన్న, ఐ. ఏ. ఎస్. ఆఫీసరు !

మాధురిపక్క, మధుసూదన్‌ని, చూసినవారంతా — 'మాధురి చాలా, చాలా, అదృష్టవంతురాలు' అని అమితంగా, మురిసి, ముచ్చటపడి, అభినందనలు, ఆశీర్వాదాలు కురిపించేరు ! బెంగాలీ సినిమా హీరోలాగా, మంచి ఒడ్డూ, పొడుగూతోపాటు, ఆరోగ్యంగా, అందంగా, ఉన్న, మధుసూదన్‌ని చూసి!

'అల్లుడు పెద్దజీతగాడే కాకుండా. అందగాడు కూడానూ !' అన్నారు! పెళ్ళికొచ్చిన బంధుమిత్రులంతా !!

ఆ రాత్రి ! మధుసూదన్‌తో, మధుర

మైనరాత్రి !! మాధురికి ఏమిటో. అంతా గిలిగింతలుగా ఉంది. పొగమంచులాంటి మల్లెల పరిమళంలాంటి, మాధురిమనస్సు మధురసామ్రాజ్యాలలో. వి హ రి స్తూ, మత్తెక్కిపోతోంది !!

మనస్సులనే కాకుండా, శరీరాలను కూడా, ఐక్యంచేసుకునే, ఈ రాత్రి లోకంలోని ఆనందమంతా. పరస్పరం పంచిపెట్టుకోవాలి ! ఈ రాత్రి తామిద్దరూ మధురానందమయప్రపంచంలో. మునిగి తేలుతూ! స్వర్గలోకాలు దర్శించేరాత్రి !!

ఎవరికి, తనని, తాను, అర్పించుకోవటంలో, నిజమైన ఆనందమున్నదో, ఆ నిజమైన ఆనందానుభవంలో, పొంద బోయే, మధురానుభూతుల్ని తలుచుకుంటూ, కోరికల కోటలాంటి బరువైన హృదయంతో! గదిలో అడుగుపెట్టింది, మాధురి !!

కాని... కాని... మాధురి ఆశించినట్లుగా, మాధురిరాకకోసం, మధుసూదన్ ఎదురుచూడటంలేదు. కిటికీదగ్గర నిలబడి సిగరెట్టు తర్వాత, సిగరెట్టుని నుశిచేస్తూ. అవతలపారేస్తూ, అలాగే ని ల బ డి పోయేడు, మధుసూదన్ !!

తన రాకను, తన ఉనికినే గమనించని! మధుసూదన్ని, ఒ క్క క్ష ణ ం అలాగే, రెప్పవాల్చకుండా. బొమ్మలా నిలబడి చూసింది. తర్వాత నెమ్మదిగా. నడిచివెళ్ళి, మధుసూదన్ పక్క నిలబడింది, మాధురి !.

చేతితో సిగరెట్టుపీకని, అవతల పారేస్తూ. పక్కగా నిలబడిన మాధురిని చూసి, మరుక్షణంలో ముఖాన్ని పక్కకి, తిప్పేసుకుంటూ, 'నువ్వు వెళ్ళి పడుకో' అన్నాడు, మధుసూదన్ ! ఆ కంఠంలో ఎక్కడా, మృదుత్వంలేదు. మాధురి ఆశించినదేదీ లేదు! మాధురి, అతనికేసి, పరిశీలనగా చూసింది ? కాని అక్కడ నుంచి కదలలేదు !

'వెళ్ళి పడుకోమన్నాను కదూ !' ఈసారి మధుసూదన్ గొంతులో, చిరాకు విన్పించింది, మాధురికి ?

మాధురి కలలప్రపంచం, చెదిరిపోతూ ఉంటే, ఒక్కసారిగా, వాస్తవంలోకి వచ్చింది. మాధురి !! ఎలాగో గొంతుకను స్వాధీనంలోకి తెచ్చుకుని, మనో నిబ్బరాన్ని కుదుర్చుకుంటూ,-'ఈ పెళ్ళి మీ కిష్టంలేని పెళ్ళికదూ ? మీ అమ్మగారి బలవంతాన జరిగింది కదూ ! మీ మనస్సు బహుశా ! మరెవరి'...

'ఏమిటావాగుడు ? ఏదో, ఎలాగో, జరిగింది ! ఎందుకు చికాకు తెప్పిస్తావ్ ? అర్థం పర్థంలేని మాటలతో !!' మాధురి మాటను పూర్తిచేయకుండానే. మధుసూదన్ అమితంగా !చికాకుపడిపోయేడు, మాధురిమీద !

ఈసారి మాధురి కళ్ళముందు - కొద్ది క్షణాలక్రితం తాను కన్న, రంగు రంగుల కలలన్నీ, కరిగిపోసాగేయి !

న వ వ ధు వు గా, కొద్దిక్షణాలక్రితం

ఎరకూ, కోరికలునిండిన బరువైన హృదయంతో, మధురసామ్రాజ్యాన్ని ఏలిన మహారాజ్ఞి !! కాని...కాని...ఈ క్షణం- ఆ సామ్రాజ్యాన్ని కోల్పోయి - ఏదో అనుభవాన్ని జీర్ణించుకున్న ఓ పెద్ద ఆరింద !! ఒక్కసారి బరువుగా, నిట్టూర్చింది మాధురి.

నిగ్రహానికి, మారుపేరు అయిన మాధురికి కర్తవ్యం స్ఫురించింది.

"చూడండి ! మనంయిద్దరం, అందరి దృష్టిలో కాని - ఇటు మావాళ్ల దృష్టిలో కాని, ఇంకా, లోకందృష్టిలోకాని-తేలిగ్గా బైటపడిపోయి, అల్లరిపడటం - నాకిష్టం లేదు ! కాబట్టి భార్యా భర్తలుగానే, నటిద్దాం !! కాదు, నటించాలి !" మాధురి ఈ నాలుగుమాటలుని, అంత నెమ్మదిగా అంత మామూలుగా, ఎలా చెప్పగలిగిందో, మాధురికే, తెలిసిరాలేదు !

నెమ్మదిగా, నడచివచ్చి, సోఫామీద వాలిపోయింది !! మాధురిగుండెలో, ఏ అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయో, ఏ పెనుతుఫానులు చెలరేగుతున్నాయో, లేదా రాగలిం ప్రవహిస్తోందో-ఒక్క మాధురికి తప్పించి,—బ్రహ్మకు కూడా, తెలియదేమో !

అనుభూతుల పండగతో, గడవవలసిన, ఆ మూడురాత్రులు అలా నిశ్శబ్దంగా, మౌనంగా, గడచిపోయేయి !!

నాలుగవనాడు మధుసూదన్ బట్టలు సర్దుకుంటున్నాడు. మాధురి అవసరంపడి అతనిగదిలోకి వెళ్ళింది.

"చూడండి. మీ అమ్మగారు, గృహప్రవేశం అనీ, సత్యనారాయణవ్రతం అనీ, నన్ను మీతోపాటుగా, తీసుకువెళతానని మా అమ్మతో చెపుతున్నారు. నేను మీతోపాటురావటానికి అభ్యంతరం లేకపోతేనే, వస్తాను. లేకపోతే, ఏదో ఒక వంకపెట్టి, అటు మీ అమ్మగారికి, ఇటు మా అమ్మకి చెప్పి, ప్రయాణం మానుకుంటాను," అంది ఎలోగో !!

మాధురి ఈ మాటలు చెపుతుంటే, మధుసూదన్ మనస్సు ఒక్కక్షణం అదోలా అయిపోయింది ! కాని... మరుక్షణంలో, ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా 'సరే ! నాకేమీ అభ్యంతరంలేదు ! కాని అక్కడ కూడా, ఇలాగే నటించాలి !' అని మళ్ళాబట్టలుసర్దుకోవటంలో, మునిగిపోయేడు.

మాధురి నిశబ్దంగా, వెళ్ళిపోయింది, అక్కడినుంచి.

మధుసూదన్ తల్లి సత్యవతమ్మగారు గృహప్రవేశం అనీ, సత్యనారాయణవ్రతం, అన్నీ యధావిధిగా, జరిపించి పార్టీలూ - విందులూ, వినోదాలు, అన్నీ లక్షణంగా, జరిపించేసేరు. తంతులన్నీ ముగిసేక, ఎక్కడిచుట్టాలు, అక్కడ సర్దుకున్నారు.

మాధురికి-మధుసూదన్ బాధ్యతల్ని అప్పగించి, సత్యవతమ్మగారు, నెమ్మదిగా, కోవెల పురాణకాలక్షేపానికి అలవాటు పడ్డారు.

దేవుడికి సంబంధించిన, ఎక్కడ ఏ పూజలు, జరుగుతున్నా, ఉత్సవాలు జరుగుతున్నా, సత్యవతమ్మగారు, తప్పకుండా వెళ్ళి చూసి రావటానికి అలవాటు పడ్డారు.

మధుసూదన్‌కి కావలసినవన్నీ, మాధురి శ్రద్ధగా చేస్తుంది. ఉదయం లేచినపుడు బ్రష్‌అందించటం దగ్గిర్నించి రాత్రి పక్కమీద పడుకునేవరకూ, ఎక్కడా, ఏ లోటూ రాకుండా, సేవలు చేస్తుంది!! అత్తగారికి పట్టుబడకుండా!

ఒకరోజు సత్యవతమ్మగారు-మాటల సందర్భంలో 'మా మధుకి కాజాలంటే చాలా యిష్టం! రేపు వాడిపుట్టినరోజు. చేయవే, అమ్మాయీ!' అన్నారు.

ఆ రోజు మాధురి అత్తగారు చెప్పినట్లుగా, స్వయంగా, కష్టపడి, కాజాలు అన్నీ తయారుచేసింది! వేరుసెనగలు, జీడిపప్పులు కలసిన మిక్సెరు కూడా, కారంగా తయారుచేసింది!? అన్నీ టేబులుమీద మూతలుపెట్టి సర్దింది.

ఆ సాయంత్రం, ఆఫీసునుంచి, అవురావురంటూ వచ్చిన, మధుసూదన్ స్నానంచేసి, క్లబ్బుకి వెళ్ళటానికి-డ్రెస్సు మార్చుకుని, టేబులుమీద మూతపెట్టి ఉన్న తన కిష్టమైన స్వీటు - హాటూ తిని, అమృతంలాంటి కాఫీతాగి, మామూలుగా, క్లబ్బుకి వెళ్ళిపోయేడు.


మాధురి ఒక్కసారి బరువుగా, నిట్టూర్చింది!! మధుసూదన్‌తో, తన పెళ్ళి అంటే, – ఎన్ని రంగుల కలలు కంది!! పెళ్ళికి వచ్చిన బంధుమిత్రులంతా, తన అదృష్టానికి ఎంత మురిసి ముచ్చటపడ్డారు!! ఎన్ని అభినందనలు తెలిపేరు!! వాస్తవంగా, ఏం జరిగింది? ఇప్పుడిక్కడ ఏం జరుగుతోంది?!

తన కలలరూపాన్ని, వాస్తవంలో అనుభవిస్తూ, కోరికలు పండించుకుంటూ ఆశలుతో, మధురానందమయ ప్రపంచంలో, జీవించటానికి కాదు! తానిక్కడకు వచ్చింది!! కేవలం తెరమీద బొమ్మలా నటించటానికి మాత్రమే వచ్చింది. అసలెందుకిలా తారుమారు అయింది?!!

అతనిగుండెలో ఏముందో, తనకు తెలియదు! అది కంచుకోట! ఆ కోటలోని రహస్యాలు, తెలుసుకునేందుకు? భార్యగా, తనకు ఏమాత్రం అవకాశం-సాహసం - శక్తీ, కూడా, తనకి లేవు?

పోనీ ఎవరికేనా, మనసువిప్పి, చెప్పుకుని, హృదయభారం తగ్గించుకునే, విషయమూ కాదు! మాధురికి, తలుచుకుంటున్న కొద్దీ - కళ్ళు నీళ్ళతో నిండిపోసాగేయి! కాని దూరాన్నుంచి, అత్తగారిని చూసి, దుఃఖాన్ని దిగమింగుకుని, కళ్ళు తుడిచేసుకుంది, మళ్లా!

ఆ రోజు మధుసూదన్ క్లబ్బునుంచి, వచ్చేసరికి, చాలారాత్రి అయిపోయింది! బట్టలు మార్చుకుని భోజనం చేయకుండానే, మంచంమీద వాలిపోయేడు. కానే




పటికి - 'అబ్బా, అమ్మా!' అంటూ కణతలు నొక్కుకోసాగాడు!

నిద్రపోని మాధురి అమృతాంజనం తెచ్చి, మధుసూదన్ తల పట్టసాగింది. మెల్లగా, మృదువుగా, హాయిగా, ఉన్న, ఆ స్పర్శకి, మధుసూదన్, బాధని మర్చిపోతూ, నెమ్మదిగా కునుకులోకి జారిపోయేడు. బాగా, అలసిపోయినట్లుగా!

మాధురి మధుసూదన్ తలని, తన ఒడిలోకి తీసుకుని, నుదుటిమీద చేయి వేసి, చూసింది! అతనికిజ్వరం తీవ్రంగా ఉంది. సాయంత్రంవరకూ బాగానే ఉన్నాడు. ఇంతలో, ఇదేమిటో, హఠాత్తుగా? మాధురి గాభరాపడి లేచివెళ్ళి బార్లీవాటరు తయారుచేసింది. కాఫీకూడా చేసి, మరో ఫ్లాస్కులో పోసింది. జ్వరం తలనొప్పి, మాత్రలు దగ్గర పెట్టుకుని-నిద్రపోకుండా, మేలుకుని కూర్చుంది. మెలకువ వస్తే, అతనిచేత మింగించుదామని. జ్వరతీవ్రతలో, నిస్సహాయుడైయున్న మధుసూదన్, మాధురిచేత సేవలు పొందటానికి, అభ్యంతరం చెప్పటంలేదు.

మరికొంచెంసేపటికి, మెలకువ వచ్చిన మధుసూదన్ 'మంచినీళ్ళు! దాహం!' అన్నాడు, నీర్సంగా! మాధురి బార్లీవాటరు ఒక గ్లాసులోపోసి చెంచాతో, మింగించింది. బార్లీ తాగిన తర్వాత అతను కళ్ళుతెరచి చూసేడు. మాధురి చాలాసేపునుంచి మేలుకునున్నట్లుగానే, కనిపించింది.

తర్వాత, మాధురి మాత్రలు, కాఫీ పుచ్చుకుని దగ్గరగా వచ్చి, 'చూడండి! ఈ మాత్రలు వేసుకుని - కొద్దిగా కాఫీ

తీసుకోండి. తెల్లవారేసరికిఅన్నీపోతాయి' అంది. మధుసూదన్‌కేసి చూస్తూ!

ఒక్కసారి, మాధురికేసి చూసి, అవి తీసుకుని మింగి, కాఫీతాగి పడుకున్నాడు. మాధురి దుప్పటి సరిగా కప్పి, అక్కడేఉన్న వాలుకుర్చీలో కూర్చుండిపోయింది. మాధురికి - మరి నిద్ర రాలేదు.

తెల్లవారింది. మధుసూదన్‌కి బాధలు తగ్గినట్లు అతనిముఖమే చెప్పింది. ఆ మర్నాడు, అతను మామూలుగానే ఆఫీసుకు వెళ్ళివచ్చేడు. అలా రోజులు గడిచిపోతూనే ఉన్నాయి! కాని అతనిలో మార్పులేదు. మాధురి మాత్రం చిక్కుతోంది. సత్యవతమ్మగారు మాత్రం ఏదో విశేషం ఉందనుకుని, మురిసి, ముచ్చటపడసాగేరు. అలావున్న మాధురినిచూసి!

ఆ రోజు మాధురి తండ్రి దగ్గర్నించి చిన్నాన్న దగ్గర్నించి, ఉత్తరాలు వచ్చేయి. రాబోయేపండక్కి, మరీ మరీ, రమ్మనమని అల్లుడిని కూతురిని ఆహ్వానిస్తూ!

ఆఫీసునుంచి మధుసూదన్ రాగానే, 'మధూ! మీ మామగార్ల దగ్గర్నించి ఉత్తరాలు వచ్చేయిరా! పండక్కి మరీ మరీ రమ్మనమని! సెలవుపెట్టి - రెండు రోజులు ముందుగానే ఇద్దరూ కలసి వెళ్ళండి! పెళ్ళయిన తర్వాత ఇదే మొదటిపండగ కదూ! పాపం సరదా పడుతున్నారు.

అమ్మాయికూడా, బెంగపెట్టుకుందో, మరేదైనా విశేషం ఉందోగాని, బాగా చిక్కిపోతోంది! ఓసారి తీసుకువెళ్లి వాళ్ళవాళ్లకు చూపించి తీసుకురారా!! పాపం!

అన్నట్లు మధూ! కోడలికి ఓ కొత్త చీరకొని తీసుకురారా! మనింటికోడళ్ళకి ప్రతీ పండక్కి - కొత్తచీర కట్టుకునే అనవాయితీ ఉంది!

'పాపం-మీనాన్నగారుకూడాఏకారణం చప్పునైనా, ఆర్థిక యిబ్బంది వచ్చినా, అదేమీ తెలియనివ్వకుండా, ప్రతిపండుగకూ —నాకు చీర తెచ్చి యిచ్చేవారు, సత్యవతమ్మగారిలో రాఘవరావు గారి స్మృతులు మెదులుతుంటే, విచలిక కంఠంతో అన్నారు.

'అలాగే తెస్తానమ్మా!' మధుసూదన్ ఆఫీసు కెళుతూ, మాధురితో, 'సాయంకాలానికి బట్టలన్నీ సర్దుకుని 'రెడీ'గా ఉండు. నేను తొందరగావచ్చి, ట్రయిన్ ఎక్కిస్తాను. నాకు రావటానికి సెలవు దొరకదు. ఇన్‌స్పెక్షన్ రోజులు!' అన్నాడు, పొడిపొడిగా!

ఈ మాటలు విన్పించి సత్యవతమ్మగారు అక్కడికివచ్చి, 'అదేమిటిరా? పెళ్లయిన తర్వాత ఇదే మొదటి పండుగ కూడానూ! నువు లేకుండా అది ఒకర్తె మాత్రం ఎలా వెళుతుందిరా? పండగ నాడయినా సెలవు యివ్వరా ఏమిటి? మీ ఆఫీసు వాళ్ళు? మరీ చోద్యం!!

పాపం ఎంతో ఉత్సాహంతో, సరదాతో, ఎదురుచూస్తూ ఉంటారు వాళ్ళు!! ఒక్కసారి కోడలి ముఖంచూస్తే, అలా అనవు నువు! పాపం చిన్నబుచ్చుకుందిచూడు!' సత్యవతమ్మగాగు ఒత్తిడి చేసేరు.

'బాగుందమ్మా! ఆఫీసా? మరోటా? పండగ లవీ అలా వస్తూనే వుంటాయి! మరోసారి వెళ్ళి రావచ్చు! అంతకంటె ముఖ్యం కదమ్మా! ఆఫీసు వ్యవహారాలు. అంటూ మధుసూదన్ పక్కగదిలోకి వెళ్ళిపోయేడు.

'పోనీ, నువయినా, బట్టలు సర్దుకోవే వెళుదువుగాని! వాడు ఆవేళ ఎలాగో తీరిక చేసుకుని వస్తాడులే! నేను పంపిస్తాను. పాపం మీ వాళ్ళు మరీమరీ రాసేరుకూడా! వాళ్ళ ఉత్సాహం పాడు చెయ్యటం దేనికి'? అని మాధురికిచెప్పి, సత్యవతమ్మగారు లోపలకు వెళ్ళిపోయేరు.

ఆ సాయంత్రం మధుసూదన్ మాధురికి కొత్త చీరా, జాకెట్టు, కొనుకువచ్చి, టేబుల్‌మీద పెట్టి 'అమ్మా? మాధురిని పిలు! కొత్తచీర తెచ్చాను. నచ్చిందో, లేదో చూసుకుంటుంది.' అన్నాడు.

పళ్లూ, పూవులు కోస్కుని కోవెలకు బయల్దేరిన సత్యవతమ్మగారు పెరట్లో జాజి అంటుకు నీళ్ళు పోస్తున్నమాధురిని పిలిచి! 'అబ్బాయి పిలుస్తున్నాడు. కొత్త చీర తెచ్చేడట? వెళ్లి చూసుకో!' అంటూ ముసిముసిగా నవ్వుకుంటూ, వెళ్లిపోయేరు.

చేతులు తుడుచుకుంటూ, మాధురి గదిలోకి వచ్చింది. ప్రయాణానికి 'రెడీ' గా లేని మాధురిని చూసి, 'అదేం 'రెడీ' కాలేదూ? యింకా? సిద్ధంగా ఉండమని ఉదయమే చెప్పాను కదా!' అన్నాడు, పాకెట్టులోంచి చీరను బైటకు తీస్తూ!

మాధురి మాట్లాడలేదు.

............

'మాట్లాడవేం?' మాధురికి దగ్గరగా వచ్చేడు మధుసూదన్!

ఒక్కసారి దుఃఖం పొంగి పొర్లి వచ్చింది మాధురికి! దగ్గరగా వచ్చిన అతని గుండెలమీదతల దాచుకునిబావురుమని ఏడిచేయాలనిపించింది. మాధురికి, కాని...కాని తాను పూర్తిగా, దురదృష్టవంతురాలు! వంచినతల ఎత్తలేదు. కళ్లల్లోంచి నీరు జారి బొట్లు, బొట్లుగా పడ్డాయి!

'ప్రయాణం అవమంటే, ఏడుస్తావెందుకు? ఇష్టం లేకపోతే చెప్పు! నాకవతల చాలా పనులున్నాయి'! అన్నాడు. విసుగ్గా మధుసూదన్!

మాధురికి చెప్పక తప్పలేదు. 'మీకు సెలవు దొరికిన తర్వాత ఇద్దరం కలసే వెళదాము,' అంది. ఎలాగో దుఃఖాన్ని అదుపులో పెట్టుకుంటూ!

'సరే! నీ యిష్టం!' మధుసూదన్ వెళ్లిపోయేడు అక్కడనుంచి!

ఆ రోజు కూడా మధుసూదన్ క్లబ్బు నుంచి వచ్చేసరికి చాలా రాత్రి అయింది. మాధురి టేబుల్ మీదే తల వాల్చి అలసి పోయినట్లుగా, పడుకుని ఉంది. పక్కనే లైటు వెలుగుతోంది.

బట్టలు మార్చుకొని లైటు తీసేద్దా మని వెళ్లిన-మధుసూదన్‌కి టేబుల్ మీద అంటించకుండా వదిలేసిన కవరు లైటు పక్కగా కనుపించింది.

మాధురి వాళ్ళ వాళ్ళకు రాసిందయుం డచ్చు ఏమి రాసిందో? అది ఓపెన్ చేసే వున్నందువల్ల, పైకితీసి చదవాలనేకుతూ హలంకలిగింది మధుసూదన్‌కి.

కవరులోంచి ఉత్తరం పైకి తీసేడు.

పూజ్యులైన అమ్మకి-నాన్నకి!

మీ ఉత్తరాలు అందేయి! ఇక్కడ మేము క్షేమం. మీ క్షేమం తెలియ పరచవలెను.

మీరు పండుగకు రమ్మని రాసేరు. చాలా సంతోషం అయింది. కాని... వారికి ఈ పండుగకు సెలవు దొరక లేదు. మీ ఉత్సాహం-సరదా పాడుచేయ వద్దని, కనీసం నన్నయినా వెళ్లమని చెప్పేరు. కాని వారులేకుండా, ఒంటరిగా రావటం, నాకు యిష్టంలేదు. అందువల్ల ప్రయాణం మానుకున్నాను, అదీగాక వారు ఈ మధ్య జ్వరంపడి లేచారు. నీర్సంగా ఉంటున్నారు. ఈ పరిస్థితిలో వారిని వదిలిపెట్టి ఎలారాగలను? వారికి కూడా, నేను లేనిదే క్షణం గడవదు కనక సెలవు దొరకగానే యిద్దరం కలిసే వస్తాము. కాబట్టి మీరు మరోలా భావించవద్దు! విశేషాలు లేవు. ఉత్తరం వ్రాయవలెను.


ఇట్లు
మీ పుత్రిక-
మాధురి.

ఉత్తరం చదివి దానినలా చేతులో ఉంచుకుని ఏమేమో, ఆలోచిస్తూ,చాలా సేపు అలాగే నిలబడిపోయేడు. మధు సూదన్! తర్వాత మాధురికేసిచూసి, బరువుగా నిట్టూర్చేడు.

లైటు ఆర్పుకుని, పక్కమీదకు వెళ్ళి పడుకునే ఓపికకూడా, లేనిదానిలా, అలాగే తలవాల్చి నిద్రపోయింది,

దగ్గరగావెళ్లి నుంచుని, పరిశీలనగా చూసేడు. ఉదయం అమ్మ చెప్పిన దానిని బట్టిచూస్తే, అందులో అవాస్తవమేమీ కన్పించటంలేదు! మాధురి నిజంగానే శుష్కించిపోయింది. పెళ్లినాడుకుందనపు బొమ్మలా ఉన్న మాధురికి-ఈ నాటి మాధురికి పోలికేమీ లేదు!! అమ్మ ఆదేదో విశేషం అనుకుని భ్రమపడు తోంది పాపం!!

తనకు విదేశాలు వెళ్లాలని, అక్క డింకా పెద్దచదువులు చదివి, పెద్ద డిగ్రీలు తీసుకోవాలనే కోరికకి- ఆశలుకి తాను సాధిద్దామనుకున్న, ఆశయాలుకి- అందు కణుగుణంగా- అనుకూలంగా, ప్రభుత్వపరంగా, వచ్చిన అవకాశాలకి



అడ్డుతగిలి, అంతరాయం కలిగించి-బతుకుమీద నమ్మకంలేని గుండె బల హీనతతో, బాధపడుతూ-తనకు పెళ్లిచేసి తన నొక యింటివాడినిచేసి, నిశ్చింతగా కాలం గడుపుదామనే దృఢసంకల్పంతో తనకీపెళ్లి చేసిందెవరు? నిజాన్కి-? తన తల్లి!!

కాని...కాని...అటువంటి అవకాశా లకిఅడ్డువచ్చిన 'రాక్షసి'గా, 'దెయ్యం'గా అనుక్షణం, తనని ఆ సంగతిని, మర్చి పోకుండా బాధిస్తున్నది ఎవరు? మాధురి!!

తననుంచి, సంగతేమిటో తెలియక-బాధపడుతూ, శుష్కించిపోతున్నది మాధురి!!

కాని నిజానికి మాధురి తప్పేమి ఉన్నది? మాధురి నిజంగా, ఒకవిధంగా దేవత!

ఆ రాత్రి జ్వరతీవ్రతతో, బాధపడుతు న్నపుడుతెల్లవార్లూమెలకువగా, కూర్చుని, ఎంతోసేవచేసింది!! తోడు జీవితంలోని

ఆదరణ, ఆప్యాయత, అంతకంటెఉన్న, అత్యవసరాన్ని, ప్రయోజనాన్నిగుర్తించలేకపోయేడు కాని...మాధురికి అంతా తెలుసు!!

నీర్సంగా ఉన్న తనని వదిలిరాలేనని రాసింది! పాపం! పిచ్చిమాధురి! నిజానికి నీర్సంగా ఉన్నదెవరు? ఛీ! అంతలా మాధురిని ఎలా శిక్షించగలిగేడు? తన చదువూ, సంస్కారం-తనలోంచి ఏమయేయి? ఏమౌతాయి? మనఃప్రవృత్తి అనే దెయ్యానికి-డిగ్రీ చదువులకు సంబంధం ఉండదనే విషయాన్ని మరోసారిఋజువు చేశాయి!

మరికొంతకాలం, ఇలాగే ఉండిపోతే మాధురి ఏమయ్యేది? ఆ ఊహ గుండె ఝల్లుమనిపించింది, మధుసూదన్‌కి!

నెమ్మదిగా, మాధురికి ఇంకా దగ్గరగా, వెళ్లి, కాళ్లకింద, మెడకిందాచేతులు వేసి, ఎత్తుకుని తనమంచం దగ్గరకు తీసుకువెళ్లి, పడుకోబెట్టాడు. దిళ్లను సరిగా పెట్టి, వచ్చి, లైటుతీసేసి. నెమ్మదిగా, వెళ్లి మాధురి పక్కలో కూర్చున్నాడు. ఇకనుంచి, తనవలన మాధురి దేనికీ, బాధపడ కూడదు!!

మాధురి తలను, తన ఒడిలోకి తీసుకుని, మాధురి శుష్కించిన ముఖాన్ని, తలను, ఆమె చేతులను, మృదువుగా ఆప్యాయంగా, ఏదో వెర్రిపట్టినవాడిలా నిమురుతూ! ఉండిపోయాడు

చల్లగా. హాయిగా, ఉన్న ఆ స్పర్శకి మెలకువ వచ్చిన మాధురి, తాను ఎవరి ఒడిలోనో, ఉన్నట్లుగా, గ్రహించి, మెల్లగా కళ్లెత్తిచూసింది! అలా చూసిన మరుక్షణంలో తాను కలగానీ కంటోందా? లేక వాస్తవమేనా? అన్పించిన మాధురి మరోసారి, కళ్లెత్తిచూసింది!

ఆ కళ్లల్లో, సంభ్రమం- మరేంటో ఆశ్చర్యం - ఇంకేవో, అనుమానం - మరేదో భయం, అన్నీ కలగా, పుల గంగా చూసేడు మధుసూదన్!

ఆ భయాన్ని చూసేసరికి, మధుసూదన్‌కి చాలా బాధకలిగింది!

'మధూ'! గొంతునిండా, ఆర్థ్రత నిండిపోతే పిలిచేడు, మధుసూదన్!

తనపేరులో అంత అందం ఉందా? లేక అతని ఆ పిలుపులో—ఆ కంఠంలో వచ్చిందా? గుండెలోతుల్లోంచి వచ్చిన ఆ పిలుపుని అర్థ్రత, ఏదో చెప్పలేని శక్తి-మాధురి గుండెలోతుల్లోకి,చొచ్చుకుపోయి, మాధురి శరీరంలోని, ప్రత్యణువునూ, పరవశింపజేసి, పులకింపజేశాయి!

మాధురి మెడకింద, తలకింద చేతులేసి, నెమ్మదిగా లేవదీసి, తన హృదయానికి దగ్గరగా, పసిపాపను అదుముకున్నట్లుగా, మరింత దగ్గరగా, అదుముకున్నాడు! మధుసూదన్!

'ఇన్నాళ్ళుగా, నిన్ను బాధపెట్టేను మధూ! క్షమించు. దానికి కారణాలువేరే ఉన్నాయి! నేనిప్పుడు చెప్పలేను.కాని..

కాని... నేనెవర్నీ ప్రేమించలేదు.' మాధురి తలను, వీపు భాగాన్ని. మృదువుగా, మెల్లగా, నిమురుతూ, అన్నాడు.

కాని మాధురి కివేమీ విన్పించలేదు. అతని హృదయ స్పందనంలోంచి, అపూర్వంగా, హాయిగా, కొత్తగా, విన్పిస్తున్న రాగాన్ని వింటూ, అతని స్పర్శలోని శక్తికీ, విన్పిస్తున్న అర్థాలుకి, మైమరచిపోతూ, లతలా, అతన్ని హత్తుకుపోయి పెనవేసుకుపోయింది!

చాలారోజులుగా, ఇద్దరి మధ్యాఉన్నా మనోబాధలన్నీ మరిచి, చాలాసేపు అలాగే ఉండిపోయేరు, వారిద్దరూ!

'మధూ! నాదొక కోరిక'? మధుసూదన్ చాలాసేపటికి మాధురిచేతపాలు తాగించిన తర్వాత అన్నాడు.

ఏమిటన్నట్లుగా చూసింది మాధురి!

'ఇకనుంచీ, ఈ క్షణంనుంచీ, నువు దేనికీ, బాధపడకూడదు! ఈ రాత్రంతా నువు అన్నీ మరచి పసిపాపలా, ప్రశాంతంగా, నా గుండెలమీదే, నిద్రపోవాలి. ఎందుచేతనో తెలుసా? నాకు నువు పాపనిచ్చేవరకూ- నువ్వే నా పాపవి!' అన్నాడు మాధురిని దగ్గరకు తీసుకుని మృదువుగా, ముద్దుపెట్టుకుంటూ!

మధుసూదన్ ఆ కోరిక- చిత్రంగా అన్పించి, వింత అనుభూతికిగురిచేసింది!

తను అలా కాకుండా, ఇంకేమైనా ఆలోచించినా, మరేమైనా జ్ఞాపకం చేసుకుని-బాధపడినా-అతను భరించలేడన్న మాట!! అందుకనే పసిపాపలా, నిద్రపొమ్మంటున్నాడు!!

ఎంతో అందంగా-మరెంతో అర్థవంతంగా, ఉంది, అనురాగం నిండిఉన్న అతని ఆ కోరికలోనే, తనబతుకులోని అందం- ఆనందం-మాధుర్యం అన్నీ యిమిడి ఉన్నాయనుకున్న మాధురికి.. మాటల్లో అనువదించలేని అనుభూతి కలిగింది!

ఆ రాత్రి, అతని ఆ కోరిక మీదనే అతని గుండెను దిండుగా, చేసుకుని, పసిపాపలా, ప్రశాంతంగా, హాయిగా, నిద్రపోయింది మాధురి!!

